జగనన్న సురక్షతో సత్వరమే మేలు

- నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి
- లబ్ధిదార్లకు రేషన్‌కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

నరసరావుపేట: జగనన్న సురక్షతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సత్వరమేలు లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం. రామ్మోహన్ అధ్యక్షతన ప్రకాష్ నగర్‌లోని టౌన్‌హాలులో నిర్వహించిన 13వార్డు సచివాలయానికి జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జగనన్న పాలనలో ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరంలేదన్నారు. ప్రజలకు ఇంట ముంగిటకే వచ్చి పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారన్నారు. ఈ వార్డులో 127 మంది ధ్రువీకరణ పత్రాలకోసం దరఖాస్తు చేయగా వారిలో 117 మందికి పత్రాలు మంజూరయ్యాయన్నారు. వీటిలో ఆదాయ ధృవీకరణ పత్రాలు 48 మందికి, కుల సర్టిఫికెట్లు 50 మందికి, బియ్యంకార్డు యాడింగ్ నలుగురికి, నూతన రైస్‌కార్డు ఒకరికి, ఆధార్‌కు మొబైల్ నంబరు సీడింగ్ 19 మందికి చేయటం జరిగిందన్నారు. కార్డుల్లో ఉద్యోగాలు, కార్లు కొనుగోలు చేసిన పిల్లల పేర్లు ఉన్న కారణంగా తల్లితండ్రులకు పింఛన్ లాంటి సంక్షేమ పథకాలు అందకపోతే ఆ కార్డుల నుంచి కుమారుల పేర్లను విడదీసి ప్రత్యేకంగా కార్డు అందజేసే సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రజలకు ఎంతో నిజాయితీగా, పారదర్శకమైన పాలన అందిస్తున్న తమ ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని కోరారు. ఈసందర్భంగా దరఖాస్తు చేసిన లబ్ధిదార్లకు ఇళ్లపట్టాలు, రేషన్ కార్డులు, కుల, ఆదాయం లాంటి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, మున్సిపల్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకుమాను బాలాహనుమంతారెడ్డి, ముదిరాజు, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ బెహరా విజయభారతి, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఎన్‌కే ఆంజనేయులు, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి, నాయకులు ఆరుదల సాంబశివరావు, కాపులపల్లి శరత్, పూనూరి కోటిరెడ్డి పాల్గొన్నారు.


నరసరావుపేటలో లబ్ధిదార్లకు ధ్రువీకరణపత్రాలు, ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


అగ్నిగుండాలలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్


లబ్ధిదారునికి రేషన్‌కార్డును అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

జగనన్న సురక్ష గ్రామసభ

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో పలువురు అధికారులు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. అనంతరం దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు, ఎంపీడీవో మంగాపురనాథ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ మోహన్‌చంద్, మండలస్థాయి అధికారులు, గ్రామసచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమం లబ్ధిదారులకు వరం

ఈపూరు: జగనన్న సురక్ష కార్యక్రమం లబ్ధిదారులకు వరమని మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం మండల కేంద్రమైన ఈపూరు, అగ్నిగుండాల గ్రామాల్లో శుక్రవారం జరిగింది. ఈపూరులో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరలక్ష్మి మాట్లాడుతూ దీర్ఘకాలంగా ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెందిన వారికి ఇది మంచి కార్యక్రమమని, ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. అగ్నిగుండాలలో 350, ఈపూరులో 310 మంది లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ చౌడయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీవో రంగనాయకులు, ఈపూరు సర్పంచ్ చెంచయ్య, అగ్నిగుండాల సర్పంచ్ మస్తాన్ బీ, వెంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాలు

వినుకొండ టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శాలివాహననగర్ -1,2 సచివాలయాల్లో శుక్రవారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, కౌన్సిలర్లు షేక్ షకీలా, నంది నరసింహారావు, డిప్యూటీ తహసీల్దార్ అబ్బూరి వెంకటేశ్వర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం లబ్ధి అందాలి

యడ్లపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా సెరికల్చర్ డీడీ, మండల ప్రత్యేక అధికారి రాధారాణీ చెప్పారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట సచివాలయం శుక్రవారం జగనన్న సురక్ష గ్రామసభను అధికారులు నిర్వహించారు. రాధారాణీ మాట్లాడుతూ అర్హత ఉండి ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకం లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఎంపీపీ ఝాన్సీ, ఎంపీటీసీ వావిళ్ల పోలేరు, తహసీల్దార్ ఎస్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో పాల్గొన్నారు.

సబ్సిడీ ధరపై టమాటా విక్రయ కేంద్రం ప్రారంభం

చిలకలూరిపేట: ప్రజల అవసరాలు తెలిసిన ప్రభుత్వం తమదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ చెప్పారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రైతు బజారులో సబ్సిడీ ధరపై టమాటా విక్రయ కేంద్రాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో టమోటా ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీ ధరపై రూ. 50కే కేజీ టమాటాలు విక్రయించేలా చర్యలు తీసుకున్నదని చెప్పారు. వినియోగదారులపై భారం పడకుండా ప్రభుత్వం సబ్సిడీ ధరపై నష్టాన్ని తామే భరిస్తూ ఈ టమోటా విక్రయ కేంద్రాన్ని రైతు బజారులో ప్రారంభించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ ఖాజా, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దుకాణంలో నగదు చోరీ

శావల్యాపురం: శావల్యాపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు దుకాణంలో గల్లాపెట్టె చోరీ చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే స్టేషన్ మార్గంలో గ్రామానికి చెందిన చెరుకూరి రామాంజనేయులు చిల్లర దుకాణంలో ఇరువురు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి గ్లాసులు, భోజన ప్లేట్లు అడగ్గా, రామాంజనేయులు లోపలకు వెళ్లి వాళ్లు అడిగినవి తీసుకొచ్చే సమయానికి దుకాణంలో ఉన్న గల్లాపెట్టె తీసుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. గమనించి రామాంజనేయులు కేకలు వేయగా స్థానికులు వెంబడించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక

యడ్లపాడు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రగతిని చూసి ఆకర్షితులైన టీడీపీ నాయకులు పలువురు వైఎస్సార్ సీపీలోకి చేరారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులకు రాచమంటి చింతారావు, పిడతల దయాసాగర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీ (పై పల్లె)కు చెందిన టీడీపీ నాయకులు కొప్పుల ఏసోబు, కొప్పుల విజయ్‌కుమార్, కొప్పుల సుదీర్ కుమార్, కొప్పుల తంబీ కుమార్ కుటుంబాలు శుక్రవారం చిలకలూరిపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు విడదల గోపీనాథ్ సమక్షంలో చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి గోపి సాదరంగా ఆహ్వానించారు.















గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులది కీలకపాత్ర



నవరత్నాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- కారుమంచిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం

శావల్యాపురం: గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కారుమంచి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకొని నవరత్నాల బుక్‌లెట్‌ను అందజేసి లబ్ధిని వివరించారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని తనదృష్టికి ఇప్పుడే వచ్చిందని, అలాగే గ్రామంలో నూతనంగా 60 విద్యుత్ స్తంభాలు వేయించి విద్యుత్ సమస్యలు పరిష్కారిస్తామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సత్వరమే సమస్యలు పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాపరపు విశ్రాంతం, ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు, గ్రామపార్టీ అధ్యక్షులు కేతినేని ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు వుట్ల సుబ్బారావు, కొణింగి వీరాస్వామి, షేక్ అక్బర్, పాతకోట నాగుర్, బొల్లా పేరయ్య, మండలపు సురేష్ ఎంపీటీసీ సభ్యులు మల్లావరపు బాబురావు, మండల కోఆర్డినేటరు పాపసాని సురేష్, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, విద్యుత్ ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి, గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బాలాజీ ఘీ స్వీట్స్ ప్రారంభం



దుకాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి, ఎమ్మెల్యే

నరసరావుపేట: పట్టణంలోని అరండల్‌పేట బ్యాంకు స్ట్రీట్‌లో ఆరిగ కిషోర్‌రెడ్డి, తెంటు బాలాజీలు భారీ ఎత్తున కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటుచేసిన బాలాజీ ఘీ స్వీట్స్ అండ్ కూల్‌డ్రింక్స్ షాపు శుక్రవారం అంగరంగవైభవంగా అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట గురజాల శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి షాపులోని వివిధ విభాగాలను ప్రారంభించారు. రానున్న రోజుల్లో షాపు వ్యాపారాభివృద్ధితో దిగ్విజయంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఇప్పటికే తమ బాలాజీ స్వీటు షాపులు సత్తెనపల్లి, గుంటూరు, పిడుగురాళ్లలో దిగ్విజయంగా నడుస్తున్నాయన్నారు. జిల్లా కేంద్రంలో తమ షాపు ఏర్పాటు ద్వారా ప్రజలకు రుచికరమైన నేతి మిఠాయిలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

9న నరసరావుపేటలో బీసీల ఆత్మీయ సమావేశం

నరసరావుపేట: పట్టణంలోని టౌన్‌హాలులో ఈనెల 9వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు టౌన్‌హాలులో నిర్వహించే బీసీల ఆత్మీయ సమ్మేళన సభకు జిల్లాలోని బీసీలు అందరూ హాజరై జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు కోరారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం.స్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో నిర్వహించే ఆత్మీయ సమావేశానికి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరై బీసీల అభివృద్ధికి పలు సూచనలు చేస్తారన్నారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు

క్షేత్రస్థాయిలో యంత్రాంగం పరిష్కారం

యడ్లపాడు: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదుతో రైతుల సమస్యకు అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించారు. ఉన్నవ గ్రామం పరిధిలో 9,93,95 సర్వే నంబర్లలోని పంట పొలాల్లో కురిసిన వర్షపు నీరు, ఎగువ నుంచి పారే వరద నీరు డొంకమార్గాన ప్రవహిస్తుందని, ఆ నీటిని డినెం: 84 కసినీటి చెరువులోకి వెళ్లకుండా తూముకు కొందరు మట్టిని అడ్డు వేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రాంతాన్ని శుక్రవారం అధికారులు ఉన్నవ గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించారు. స్థానిక రైతుల్ని విచారణ చేసిన తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు, ఈవోపీఆర్డీ బృందావనం వరూధిని, పంచాయతీ కార్యదర్శి జయబాబు ఉన్నవలోని తూముకు అడ్డుగా వేసిన మట్టిని జేసీబీ యంత్రంతో తొలగించారు.

హరిజనవాడలో వ్యక్తిపై దాడి

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామంలో హరిజనకాలనీకి చెందిన వ్యక్తిపై తలపై గొడ్డలితో దాడి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జ్ ఎస్సై గల్లా రవికృష్ణ వివరాల మేరకు హరిజన కాలనీకు చెందిన ఓ వ్యక్తి వివాహేతర సంబంధం నేపథ్యంలో నగదు విషయమై వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో గొడ్డలితో సదరు వ్యక్తిపై దాడి చేసే స్థాయికి వివాదం చేరింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నేడు మహానేత రాజన్న జయంతి

వినుకొండ(నూజెండ్ల): మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 74వ జయంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నేత పీఎస్ ఖాన్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఈపూరు : మండలంలోని ఊడిజర్ల, ముప్పాళ్ల, కొచ్చర్ల, ఈపూరు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎల్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్‌ల్లో, 11 కేవీ, 33 కేవీ, ఎల్‌టీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌ను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

నరసరావుపేట: సబ్ డివిజన్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్‌లలో మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటలవరకు పట్టణంతో పాటు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు శుక్రవారం వెల్లడించారు.

సబ్సిడీపై రూ.50కే కిలో టమాటాలు



మార్కెట్‌యార్డులో టమాటా విక్రయ కేంద్రాన్ని రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలు ఎక్కువగా ఉండడంతో సబ్సిడీపై ప్రభుత్వం కిలో రూ.50కే అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డులో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సబ్సిడీ విక్రయ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుతో కలిసి ఎమ్మెల్యే రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టమాటా ధర పెరుగుతున్నందున ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని వివరించారు. కోవిడ్ సమయంలో టమాటా, ఉల్లిపాయలను సబ్సిడీపై పంపిణీచేసిన విషయాన్ని గుర్తు చేశారు. నరసరావుపేటకు 1,500 కిలోల టమాటాలు వచ్చాయని, మూడురోజుల పాటు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అగ్రికల్చరల్ ట్రేడ్ మార్కెట్ ఆఫీసర్ కె.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం జిల్లాకు ఐదు టన్నులు కేటాయించిందన్నారు. చిలకలూరిపేటకు రెండు టన్నులు, నరసరావుపేట, సత్తెనపల్లికి 1.5టన్నులు సరఫరా చేసినట్టు వివరించారు. చిలకలూరిపేట, సత్తెనపల్లిల్లో రైతుబజార్లలో విక్రయిస్తుండగా నరసరావుపేటలో మార్కెట్‌యార్డులో కేంద్రం ఏర్పాటు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఎ.హనీఫ్ పాల్గొన్నారు.









